కళ్లు మూసుకున్నాం.. తవ్వేసుకోండి..

- చల్లపల్లిలో 150 ఎకరాల్లో అనధికార ఆక్వా చెరువుల తవ్వకాలు
- 9 గ్రామాలకు అందే తాగునీరు కలుషితం
- లోపాయికారి ఒప్పందాలతో పట్టించుకోని అధికారులు



చల్లపల్లి ప్రధాన పంట కాలువను ఆనుకుని అనధికారంగా తవ్వుతున్న ఆక్వా చెరువులు(అంతర చిత్రంలో తాగునీరందించే ఓహెచ్ఆర్ ట్యాంకు)

ఉప్పలగుప్తం: ఆక్వా సాగుకి ఒక్క చెరువు తవ్వాలన్నా సరే ముందుగా వ్యవసాయ, మత్స్య, రెవెన్యూ, భూగర్భజలవనరులు తదితర శాఖలతో కూడిన అధికారుల కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతివ్వాలి. పూర్తిగా వ్యవసాయానికి పనికిరాని, మురుగునీటి కాలువ సౌకర్యం ఉన్న భూమిలోనే తవ్వకాలకు అనుమతులివ్వాల్సి ఉంటుంది. అసలు ఆక్వా సాగు చేయాలంటే సర్టిఫికేషన్ ఆఫ్ కల్టివేషన్(సీవోసీ)ను కచ్చితంగా స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి పొందాలి. అంతేకాదు పంటకాలువలకు, తాగునీరందించే ప్రాజెక్టులకు ఆనుకుని ఉన్న భూముల్లో ఆక్వా చెరువులు తవ్వడానికి వీల్లేదు. ఇన్ని నిబంధలున్నా ఒక్కటీ పాటించకుండా మండలంలోని చల్లపల్లిలో 150 ఎకరాల మేర అక్రమంగా ఆక్వా చెరువుల తవ్వకాలు సాగుతున్నాయి. అంతా తెలిసినా సరే అధికారులు మాత్రం మేం కళ్లు మూసుకున్నాం.. మీరు తవ్వేసుకోండి అన్న రీతిలో వ్యవహరిస్తుండడంపై తీవ్ర విమర్శలు రేగుతున్నాయి.

తాగునీరు కలుషితం

చల్లపల్లి నుంచి ఎస్.యానాం వెళ్లే మార్గంలో కొత్త కాలువగా పిలుచుకునే పంట కాలువ ఉంది. ఆ పంట కాలువను ఆనుకుని సుమారుగా 150 ఎకరాల మేర ఆక్వా చెరువులను నిభందనలకు విరుద్ధంగా తవ్వుతున్నారు. ఈ పంట కాలువ నీటిపై ఆధారపడి మండలంలో 9 గ్రామాలకు తాగునీటినందించే 40 ఎకరాల ఉప్పలగుప్తం ప్రాజెక్ట్ మంచినీటి చెరువు, ఎస్.యానాంలో 2 ఎకరాల విస్తీర్ణంతో కూడిన రెండు చెరువులు ఉన్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఈ చెరువులకు కొత్త కాలువ ద్వారానే నీటిని సరఫరా చేయాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా వరి క్షేత్రాలుగా కనిపించిన కొత్త కాలువ, ప్రాజెక్ట్ ప్రక్కన ప్రాంతాలు ఉన్నట్టుండి ఆక్వా చెరువులుగా మారటంతో పరసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

భారీగా ముడుపులు అందాయంటూ చర్చ

సుమారు 1.5 కిలోమీటర్ల మేర పంట కాలువ ఉండటం, కనీసం డ్రెయిన్ సౌకర్యం లేకుండా దానిని ఆనుకునే చెరువులు తవ్వుతుండడంతో రానున్న రోజుల్లో ఆక్వా చెరువుల్లో ఉన్న ఉప్పు నీరు పంట కాలువలోకి ఊరి కాలువ నీరు సైతం ఉప్పునీరుగా మారడం ఖాయంగా కనిపిస్తుంది. పైగా కాలువ మట్టంతో పోలిస్తే తవ్విన చెరువుల లోతు మూడడుగుల ఎత్తులో ఉండడంతో పాటు వాటికి అమర్చిన నీరు దింపే సిమెంట్ తూరలు పంట కాలువకు అనుసంధానం చేశారు. దీంతో ఆక్వా చెరువుల నీరు దిగువకు కాలువలోకి వదిలితే ప్రాజెక్ట్ ద్వారా తాగునీరు తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడటం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో పెద్ద మొత్తంలో ముడుపులు అందాయన్న చర్చ స్థానికంగా సాగుతుంది.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు



ఎక్కడైనా పంట చేలను నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువులుగా మారిస్తే అక్కడి ప్రాంతాన్ని పరిశీలించి పనులు నిలుపుదల చేయాల్సిన మొదటి బాధ్యత పూర్తిగా రెవెన్యూ అధికారులదే. ప్రస్తుతం చల్లపల్లిలో జరుగుతున్న తవ్వకాలకు మేము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు.

– ఎస్.నాగమణి, మత్స్యశాఖాధికారి, ఉప్పలగుప్తం మండలం

చర్యలు తీసుకుంటాం



ఎక్కడైనా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వితే ప్రధాన పాత్ర పోషించి నోటీసులు జారీ చేయాల్సిన బాధ్యత పూర్తిగా మత్స్యశాఖాధికారులదే. అన్ని శాఖలతో కలిసి ఈ విషయంపై చర్చించి అనధికారికంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నవారిపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.వెంకటరమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఉప్పలగుప్తం

ముందుగానే ఊహించాం

ఆక్వా చెరువులతో బ్రాంచ్ కాలువలో ఇలాంటి పరిస్థితులను ముందుగానే ఊహించాం. అందుకే సుమారు నాలుగు మీటర్ల దూరంలో ఉన్న అమలాపురం చల్లపల్లి ప్రధాన పంట కాలువ నుంచి సీఎస్ఆర్ నిధులతో రూ.95 లక్షల వ్యయంతో నేరుగా రెండు ప్రాజెక్ట్‌లకు చేరేలా పైపులైన్లను సిద్ధం చేశాం. త్వరలోనే ఈ పైపుల నుంచి నీటిని సరఫరా చేస్తాం.

– ఎస్.పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, అమలాపురం

క్లుప్తంగా

వారానికి మూడు రోజులు ట్యాంకర్లు పంపాలి

అమలాపురం టౌన్: వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా పట్టణంలోని 19వ వార్డు ప్రజలకు వారానికి మూడు రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడిని సదరు వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చిక్కాల రవిశంకర్ కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అయ్యప్పనాయుడిని రవిశంకర్ కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం వారానికి ఒక రోజు మాత్రమే వాటర్ ట్యాంకర్ పంపిస్తున్నారని, అవి ప్రజలకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. గతంలో తమ వార్డుకు వారానికి మూడు రోజులు ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపించేవారని చెప్పారు.

కొనసాగుతున్న దీక్షా యాగం



సురభి–గోరక్ష యాగాన్ని నిర్వహిస్తున్న యాగకర్త కిరణ్‌శర్మ

అమలాపురం టౌన్: స్థానిక వేద మాత గాయత్రి దివ్య భవ్య సాధనా మందిరం గీతాశ్రమం ప్రాంగణంలో లక్ష గో పిడకలతో జరుగుతున్న సురభి–గోరక్ష దీక్షా యాగం రెండో రోజు బుధవారం వైభవోపేతంగా సాగింది. ఉదయం గోమయ గణపతికి గరికి పూజ చేయడం ద్వారా యాగం కొనసాగించారు. అనంతరం గోమయ గౌరీ వ్రతం, గో గాయత్రి జప యజ్ఞం, గో గ్రహ నక్షత్ర శాంతి హోమం, వరాహ హోమం వంటి పూజాధికాలు చేశారు. ట్రస్ట్ కార్యదర్శి కోకా రాంబాబు, కోశాధికారి ఆకుల శ్రీదేవి తదితరులు భక్తులకు సేవలందించారు.

వేసవి వినోదం ప్రారంభం



వేసవి వినోదంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వక్తలు

తాళ్లరేవు: స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవి వినోదం(సమ్మర్ క్యాంప్) కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దేశభక్తి గీతాలు నేర్పించారు. విద్యార్థుల ఆసక్తిని బట్టి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ వారం రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణనిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, పుల్లెపు వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, రమణకుమార్, తాతారావు తదితరులు పాల్గొని విద్యార్థులకు అనేక అంశాల్ని బోధించారు.

ఆడపిల్లల్ని ప్రసవించిన తల్లులకు బహుమతులు



ఆడ శిశువును ప్రసవించిన తల్లికి చీర, పండ్లు అంజేస్తున్న శంకరమూర్తి

అమలాపురం రూరల్: మండలంలోని బండార్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండంటి ఆడ శిశువులను ప్రసవించిన తల్లులకు గ్రామానికి చెందిన శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ప్రోత్సాహకంగా చీరలు, పండ్లు బుధవారం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు ఆడపిల్లలు పుట్టాలి, పెరగాలి అనే ఉద్దేశంతో ప్రోత్సాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శంకరమూర్తి తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాసు నాయక్, కె.శేషుబాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి ఎగనామం

ఉప్పలగుప్తం: డీలరు, ఎండీయూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రేషన్ బియ్యానికి దూరమయ్యామని పెదగాడవిల్లి గ్రామానికి చెందిన సుమారు 120 మంది కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ నిర్వాహకుడు ఈ నెలలో కొన్ని కార్డులకు మాత్రమే రేషన్ అందించి వెళ్లిపోయాడని, అనంతరం రేషన్ డీలర్ సైతం ఒకరోజు మాత్రమే వీఆర్వోకు సమాచారమిచ్చి రేషన్ ఇచ్చారన్నారు. దీనిపై సోమవారం స్పందనలో ఫిర్యాదుచేశామన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరిని వివరణ కోరగా ఘటనపై ఆలస్యంగా సమాచారమందిందని, ప్రస్తుతం రేషన్ వచ్చే అవకాశం కోల్పోయారన్నారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డీలర్, ఎండీయూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గర్భిణులకు ఉచిత భోజన ప్యాకెట్లు



గర్భిణులకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చిన సుమారు 50 మంది గర్భిణులకు చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ద్వారా వరుసగా ఏడో వారం ఉచితంగా భోజన ప్యాకెట్లను అందజేశారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ఆస్పత్రి వైద్యురాలు శిరీషల చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వేలూరి సూరిబాబు, సామా భగవాన్, నున్న దత్తు, చోడే శ్రీనివాస్, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 4న కానిస్టేబుల్ పోస్టులకు రాతపరీక్ష

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు వచ్చే నెల 4న ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి(డీపీఅండ్ఏఆర్) ఎగ్జామ్ సెల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. రాత పరీక్ష కోసం పుదుచ్చేరిలో మొత్తం 9 పరీక్షా సెంటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే 0413–2233338 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

నిరుపేదలకు కొండంత అండ



సూరాయి చెరువులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- సూరాయి చెరువులో గడప గడపకూ మన ప్రభుత్వం

ముమ్మిడివరం: రాష్ట్రంలో నిరుపేదలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొండంత అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 8వ వార్డు సూరాయిచెరువు సచివాలయ పరిధిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి అందుతున్న సంక్షేమ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెయ్యల చిట్టిబాబు, పార్టీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, కోలా బాబ్జీ, టౌన్ సచివాలయ కన్వీనర్ రెడ్డి శివన్నారాయణ, కౌన్సిలర్ బడుగు శ్రీవాణి, చెల్లి మధు, దొమ్మేటి అప్పారావు, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జననేతకు ఘన స్వాగతం







ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కొవ్వూరులో జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



జానీ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఓ సెల్ షాపు యాజమాని చనిపోతే పట్టణంలోని మిగిలిన సెల్ షాపుల వ్యాపారులు ఆ కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సాయం అందించి తమ సంఘీభావాన్ని చాటారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో కేబీ సెల్ కేర్ షాపు యాజమాని జానీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణ సెల్ షాపు అసోసియేషన్ తరపున అధ్యక్షుడు ర్యాలి రాజేష్ ఆధ్వర్యంలో రూ.40 వేలు సేకరించి జానీ కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కేజీఎస్ షబ్బీర్, ఎస్ఆర్టీ రాజేష్, సత్య, రహీమ్, తులసి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ హిత జీవన శైలి ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులు, కానిస్టేబుళ్లు తదితరులు

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరూ వ్యక్తిగత బాధ్యతగా భావిస్తే సమాజంలో పర్యావరణ హిత జీవన శైలి ఆవిష్కృతమవుతుందని వార్డు సచివాలయ పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శి బండి వీరన్న అన్నారు. పర్యావరణ జీవన శైలిపై స్థానిక జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయం వద్ద బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వీరన్న పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వుడు పోలీసులచే పర్యావరణ హిత జీవన శైలి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎంఎస్ మూర్తి, ఎస్ఐలు బి.దిలీప్ చైతన్య, బి.ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ శిబిరానికి రూ.12 వేల విరాళం



శిక్షణ శిబిరంలో క్రీడాకారులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా స్థలంలో జరుగుతున్న వేసవి ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 150 మంది విద్యార్థులకు పౌష్టికాహారం నిమిత్తం అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ రూ.12 వేల నగదును బుధవారం విరాళంగా అందించింది. ఈ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సమక్షంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కల్వకొలను తాతాజీ, యెండూరి నాగేశ్వరరావు బుధవారం రూ.12 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో శిబిరం కోచ్ ఆకుల ఉమ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుడుపూడి సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ ప్రతినిధులు సంసాని బులి నాని, కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ రఘునాయగంకు సీడీసీ బాధ్యతల కొనసాగింపు

యానాం: ఎస్పీ స్థాయి బాధ్యతలు తీసుకున్న యానాం ఎస్పీ రఘునాయగంకు కరెంట్ డ్యూటీ చార్జిస్(సీడీసీ) కొనసాగిస్తూ బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకూ ఎస్పీ స్థాయి విధులు నిర్వహిస్తున్న రఘునాయగానికి పే అండ్ అలెవెన్స్‌సెస్ సైతం ఎల్జీ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉంటాయని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా బాలచంద్రన్‌కు సిగ్మా సెక్యూరిటీ, శర్వణన్‌కు హోమ్ గార్డ్స్, భక్తవత్సలంకు నార్త్ సబ్ డివిజన్, యు.రాజశేఖరన్‌కు కమాండెంట్ పీఏపీల్లో కరెంట్ డ్యూటీ చార్జిస్‌ను కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు.

ముగిసిన ఉచిత శిక్షణ శిబిరం



ఉచిత బాల్ బాడ్మింటన్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

యానాం: యానాం బాల్‌బాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో గత నెల 24 నుంచి నిర్వహించిన ఉచిత బాల్ బాడ్మింటన్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. శిక్షణ అనంతరం 23, 24 తేదీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విభజించి టోర్నమెంట్ నిర్వహించి మెరుగైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బాల్ బాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శేష సుమన్, కోచ్ బొట్టా శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు రాయపురెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని అమలు చేయాలి

ముమ్మిడివరం: ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని అమలు చేసి దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరుతూ దళిత బహుజన మహిళా శక్తి సంఘ సభ్యులు ముమ్మిడివరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. షెడ్యూల్ కులాలు, తెగల ఉప ప్రణాళికా చట్టం ప్రచారోద్యమం బుధవారం ముమ్మిడివరం చేరుకుంది. కార్యక్రమంలో కొంకి రాజామణి, కొండా దుర్గారావు, వెంటపల్లి భీమశంకరం, బూల తులసీమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

ఐ.పోలవరం: మండల పరిధిలోని వలంటీర్లకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చేతుల మీదుగా గురువారం సత్కార కార్యక్రమం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేశనకుర్రుపాలెం క్షత్రియ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

నాకోసం ట్రాఫిక్‌ను ఆపొద్దు

యానాం: తాను ఇంటి నుంచి అసెంబ్లీకి వెళుతుండగా మార్గమధ్యంలో తన కోసం ట్రాఫిక్‌ను నిలుపుదల చేయొద్దని, ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని పుదుచ్చేరి సీఎం రంగసామి పోలీస్ శాఖను బుధవారం ఆదేశించారు. అదేవిధంగా తరచూ ట్రాఫిక్‌ను నిలుపుదల చేయొద్దని హోమ్‌మంత్రి నమశ్శివాయం సైతం ఆదేశాలు జారీచేశారు.

తెల్ల దోమ నుంచి కొబ్బరి చెట్లను రక్షించాలి

ఉప్పలగుప్తం: రైతులు బదనికల ద్వారా తెల్లదోమ నుంచి కొబ్బరి చెట్లను రక్షించి పంట దిగుబడిని పెంచుకోవాలని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ పరిశోధన కేంద్ర ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నంగవరం సచివాలయ కార్యాలయంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు, సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తెల్ల దోమ నివారణ కోసం మిత్ర పురుగులను అభివృద్ధి చేయాలని రైతులకు సూచించారు. అనంతరం బదనికలను ఉపయోగించే పద్ధతిని రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఉద్యావనాధికారి ఎం.శైలజ, సిబ్బంది బి.గోవర్ధన్, ఎం.అనూష, రైతులు జంపన బాపిరాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక బోర్డు

యానాం: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, స్టాఫ్‌నర్సులు, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు తదితర గ్రూప్–సీ, బీ(నాన్ గెజిటెడ్)పోస్టుల భర్తీకి ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు అనుమతివ్వాలంటూ బుధవారం పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ విభాగం కేంద్రహోమ్‌శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు రెండు కేటగిరీలు గల పుదుచ్చేరి సబార్డినేట్ సర్వీస్ సెలక్షన్ బోర్డు ఫర్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ బోర్డు ఏర్పాటైతే అసిస్టెంట్స్, స్టాఫ్‌నర్సులు, ప్రాథమిక పాఠశాలల టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు, పోలీస్ కానిస్టేబుల్స్, లోయర్, అప్పర్ డివిజన్ క్లర్కుల పోస్టులను డైరెక్ట్‌గా భర్తీచేయొచ్చన్నారు. కేంద్రహోంశాఖకు పంపిన ప్రతిపాదన ఆమోదం పొందుతుందనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేశారు.

ప్రభుత్వ కళాశాలకు ఉపాధ్యాయులు సిద్ధం

ఉప్పలగుప్తం: జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేస్తున్న ఇంటర్ విద్య బోధించేందుకు అన్ని సబ్జెక్టుల జూనియర్ అధ్యాపకులు విధులకు వచ్చారని ప్రధానోపాధ్యాయురాలు లంకా రాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ చదువు కోసం బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు ఏర్పరచిందన్నారు. దీన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎంపీ వైథిలింగం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల్లో టీచర్ పోస్టులను దశలవారీగా భర్తీ చేయాలన్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వాటి ప్రభావం విద్యార్థుల పాస్ పర్సంటేజీపై పడుతుందన్నారు.

శ్మశాన వాటికకు 12 సెంట్ల భూమి కేటాయింపు

అల్లవరం: గోడిలంక పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ ప్రజలకు శ్మశాన వాటిక నిర్మాణానికి గ్రామానికి చెందిన నడింపల్లి రమేష్‌రాజు 0.12 సెంట్ల భూమిని ఇచ్చేందుకు అంగీకరించారు. అంబేడ్కర్ నగర్‌కు శ్మశాన వాటిక ఏర్పాటుచేయాలని ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రమేష్‌రాజు స్థలమిచ్చేందుకు ముందుకు రావడంతో చిరకాల కోరిక ఫలించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాత రమేష్‌రాజుని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, రుద్రరాజు దత్తుడురాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలురైతు మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి గ్రామానికి చెందిన బొడ్డు గంగాధరరావు(40) పురుగుల మందు తాగి కాకినాడలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొడ్డు గంగాధరరావు చొల్లంగి వేంకటేశ్వరస్వామి దేవస్థానం భూమిని కౌలు చేస్తున్నాడు. పంట నష్టం రావడంతో అప్పుల బాధతో తాగుడుకు బానిసై భార్యతో గొడవపడి పొలంలో ఉపయోగించే మంగళవారం పురుగుల మందు తాగేశాడు. కుటుంబసభ్యులు అతడిని 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీ మృతి



విద్యావతి(ఫైల్)

ఉప్పలగుప్తం: ఉపాధి పనులు చేస్తూండగా కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని గోపవరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుంచే విద్యావతి(61) బుధవారం ఉపాధి పనులకు వెళ్లి అక్కడ పనిచేస్తుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపిడీవో కేఎస్ గౌరీకుమారి, ఏపీవో వి.రాజామణి, ఫీల్డ్‌అసిస్టెంట్ ఈశ్వరరావు తదితరులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రథానికి భద్రతా చర్యలు

ఐ పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి ఆలయానికి ఇటీవల ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ కుటుంబసభ్యులు రూ.12 లక్షలు విలువ చేసే టేకు రథాన్ని బహూకరించారు. ఈ నేపథ్యంలో రథానికి ఆలయ అధికారులు భద్రత నిమిత్తం షెడ్డు నిర్మించి సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. షెడ్డును బుధవారం ఆలయ చైర్మన్ వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ప్రారంభించారు.